క్లుప్తంగా

తిరుమలలో జానపద కళల ప్రదర్శన



టీటీడీ బ్రహ్మోత్సవాల్లో జిల్లా జానపద కళాకారులు

బొంరాస్‌పేట: బ్రహ్మోత్సవాల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా జానపద కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంటున్నాయి. శనివారం మాడవీధులగుండా నిర్వహించిన శ్రీవారి పల్లకీసేవా సందర్భంగా అశోక్‌మాస్టర్ బృందం లంబాడీ, కోయ నృత్యం ప్రదర్శించారు. అనంతరం ఆలయ సీఈఓ, బ్రహ్మోత్సవాల నిర్వాహకులు కళాకారులతో కలిసి ఆదారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, కళాకారులు అనంతయ్య, హన్మంతు, వెంకటేశం, శోభారాణి, అన్నపూర్ణ, రేణుక, సంతోష కుమారి, కౌముధి, మాధవి సహకారం అందిస్తున్నట్లు అశోక్‌మాస్టర్ తెలిపారు.

రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్

ఎంపీడీఓ విజయలక్ష్మి



మహిళా రిజర్వేషన్లను ఖరారు చేస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని 256 వార్డు సభ్యులకు గాను 50శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో మహిళా వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలలో రొటేషన్ పద్ధతిపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కలిపి 50శాతం ఖరారు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండలప్రత్యేకాధికారి సదానందం, మండలస్థాయి రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారుల నమోదు తప్పనిసరి

పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి



వివరాలు నమోదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి

దుద్యాల్: ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను తప్పనిసరిగా ఆవాస్ ప్లస్‌లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి పేర్కొన్నారు. శనివారం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు దారుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గతంలో దరఖాస్తు చేసుకున్న 600 మందిని షార్ట్ లిస్టు చేశారన్నారు. కొంత మందికి మొదటి విడుతలో ఇళ్లు మంజూరయ్యాయని, రెండో విడుతలో ఇళ్ల మంజూరునకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆవాస్ ప్లస్ ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు నిబంధన మేరకే సేకరిస్తున్నట్లు చెప్పారు.

గురువుస్థానం ప్రధానమైనది

రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప



మాట్లాడుతున్న ఈశ్వరప్ప

పరిగి: భారతీయ సంస్కృతిలో గురువుస్థానం ప్రధానమైనదని రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప పేర్కొన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గురు వందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సనాతన ధర్మాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు తపస్ కీలక భూమిక పోషిస్తుందన్నారు. ఉపాధ్యాయులు ఏ పాఠశాలలో పని చేసినా విద్యార్థులకు విలువతో కూడిన విద్యనందించాలన్నారు.

జొన్నపంట దిగుబడిపై అంచనా

కుల్కచర్ల: అడవివెంకటాపూర్‌లో నూతన విధానం ద్వారా పంట దిగుబడిని లెక్కించారు. శనివారం అడవివెంకటాపూర్ గ్రామంలోని బాద్య నాయక్ జొన్నపంట దిగుబడిపై కేంద్ర గణాంక అధికారి ప్రభాకర్‌రావుతో కలిసి సందీప్ రెడ్డి పరిశీలించి లెక్కించారు. 5/5 పొడవు వెడల్పులో పంటను అంచనా వేశారు. దీని ప్రకారం ఒక ఎకరాకు 10క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

పల్లెల్లో ఎన్నికల సందడి

- స్థానిక పోరుకు సమాయత్తం
- గెలుపునకు విశ్వప్రయత్నాల్లో ఆశావహులు
- ప్రధాన పార్టీల నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు



ఎంపీడీఓ కార్యాలయం

దౌల్తాబాద్: పల్లెల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కుతుంది. దీనికోసం యంత్రాంగం ఒక్కో పనిని పూర్తి చేసుకుంటూ వడివడిగా ముందుకు వెళ్తుంది. ఇప్పటికే గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లకు సంబంధించి ఓటర్ల జాబితాలను ప్రకటించింది. పోలింగ్ కేంద్రాలను కూడా గుర్తించింది. తాజాగా ఆయా స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఉన్నతాధికారుల ఆమోదం అనంతరం వాటి వివరాలను బహిర్గతం చేయనున్నారు. అలాగే శనివారం రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులుగా విధులు నిర్వహించే ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి జీఓ విడుదలవ్వడంతో కసరత్తు వేగం చేశారు.

కలుపుగోలుగా మసులుకొంటూ..

పల్లెల్లో బతుకమ్మ, దసరా పండుగలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల సందడి కూడా కనిపిస్తోంది. ఆశావాహులు, మాజీ ప్రజాప్రతినిధులు యంత్రాంగం చేస్తున్న ఏర్పాట్లను నిశితంగా గమనిస్తూ తమ కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారు. గ్రామాల్లో గుర్తింపు కోసం పండగ శుభాకాంక్షలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దేవీనవరాత్రి ఉత్సవాల మండపాల నిర్వాహకులైన యువతకు సాయం అందజేస్తున్నారు. సెలవులకు ఊరికి వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రసన్నం చేసుకుంటున్నారు. బలమైన ఓటు బ్యాంకు ఉన్న పార్టీ నుంచి బరిలోకి దిగాలనే వ్యూహంతో ఆయా పార్టీల నాయకులను కలిసి ఫొటోలు దిగి వాటిని స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో పెడుతున్నారు.

రిజర్వేషన్ల ఖరారు పైనే ఆశ

ఆశావాహులు రిజర్వేషన్ విషయంలో ఉత్కంఠతను ఎదుర్కొంటున్నారు. టికెట్ కేటాయించే నాయకులకు అనుచరులుగా ఉన్న వాళ్లు పదవులపై ఆశలు పెట్టుకున్నారు. రిజర్వేషన్ కలిసొస్తే విజయం నల్లేరుపై నడకేనన్న నమ్మకంతో మసలుకుంటున్నారు. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఆ తర్వాతే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంటుందని సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ గుర్తుల ప్రభావం ఉండనుండడంతో ప్రధాన పార్టీల నేతల ఆశీర్వాదం తప్పనిసరి కానుంది. మండలంలో 33 గ్రామ పంచాయతీలు, 290 వార్డులు, 14 ఎంపీటీసీ స్థానాలకు, 40,977 ఓటర్లు, 290 పోలింగ్ బూతులు ఉన్నాయి. అయితే మండలంలోని ఆయా గ్రామాల్లో ఎక్కడ చూసినా ఎన్నికల వాతావరణమే కనిపిస్తుంది.

రిజర్వేషన్ల కల్పన రేవంత్‌కే సాధ్యం



బొంరాస్‌పేట: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



దుద్యాల్: సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింలుగౌడ్

బొంరాస్‌పేట: సామాజిక వర్గాలకు రాజ్యాంగ బద్ధంగా రిజర్వేషన్లు కల్పించడం సీఎం రేవంత్ రెడ్డికే సాధ్యమైందని ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింలుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని భూలక్ష్మి చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బీసీలకు 42శాతం కల్పించడం చారిత్రక మార్పు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్, మల్లేశం, రాంచంద్రారెడ్డి, అర్షద్, నర్సింలునాయుడు, సూర్యప్రకాశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల్: 42 శాతం రిజర్వేషన్ ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో సీఎం చిత్ర పటానికి కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బీసీ సంఘం జిల్లా ముఖ్య నాయకుడు మేరుగు వెంకటయ్యతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆవుటి శేఖర్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బీసీలకు న్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం గౌడ్, కృష్ణ, సత్యనారాయణ, ఖలీల్ పాషా, ఖాజా, లక్ష్మయ్య, రవి నాయక్, సంతోష్ నాయక్, కృష్ణ నాయక్, అనంతయ్య, లాలప్ప, రఘుపతి, యాదవరెడ్డి, రమేశ్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శివకుమార్, రూప్ల నాయక్, కేశవులు, పాల్గొన్నారు.



అనంతగిరి: వైభవలక్ష్మి ఆలయంలో గాయత్రీ దేవిగా అమ్మవారు



ధారూరు: లక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు

దేవీ నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో ఏర్పాటు చేసిన ఆయా మండపాల్లో, దేవాలయాల్లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం గాయత్రిదేవిగా అలంకరించారు. నిర్వాహకులు ఆయా మండపాలవద్ద, ఆలయాల్లో తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటున్నారు.



కుల్కచర్ల: బండవెల్కిచర్లలో బోనాలతో మహిళలు

ఎస్సీలకు వార్డులు కేటాయించాలి

ఎంపీడీఓ విశ్వప్రసాద్‌కు గౌతపూర్ గ్రామస్తుల వినతి

తాండూరు రూరల్: మండలంలోని గౌతపూర్ గ్రామంలో ఎస్సీలకు వార్డుల్లో రిజర్వేషన్ స్థానాలు కేటాయిస్తూ ప్రకటన జారీ చేయాలని నాయకులు రాజప్పగౌడ్, నాగప్ప, నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వార్డుల రిజర్వేషన్‌పై ఎంపీడీఓ విశ్వప్రసాద్ అధ్యక్షతన రాజకీయ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గౌతపూర్ గ్రామంలో 500 మంది ఎస్సీ జనాభా ఉందని, ప్రస్తుత వార్డుల రిజర్వేషన్‌లో ఒక్క స్థానం కూడా కేటాయించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి మూడు వార్డులను ఎస్సీలకు కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ

చైతన్య కళాశాల కరస్పాండెంట్ వెంకట్ రెడ్డి

తాండూరు టౌన్: సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ అని చైతన్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పెరుమాళ్ల వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కళాశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పూలను పూజించే సంప్రదాయం ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. తీరొక్క పూలతో చేసిన బతుకమ్మను కొలుస్తూ విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు పాటలు పాడుతూ ఉల్లాసంగా నృత్యాలు చేశారు.



తాండూరు టౌన్: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

బీఆర్‌ఎస్‌లో చేరిక

దుద్యాల్: కొడంగల్ నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కేటీఆర్ సమక్ష్యంలో శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో కొడంగల్ నియోజకవర్గానికి చెందిన నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. దుద్యాల్ మండల పరిధిలోని లగచర్ల, హకీంపేట్, రోటిబండ తండా, పులిచర్లకుంట తండా, గడ్డమీది తండాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం కేటీఆర్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. లగచర్ల మాజీ ఉప సర్పంచ్ రాఘవేందర్, వార్డు సభ్యుడు సంగు వెంకటయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, మదరప్ప, హకీంపేట్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కుమ్మరి శివ కుమార్, రోటిబండ తండా మాజీ ఉప సర్పంచ్ రాములు నాయక్, దుద్యాల్ గ్రామానికి చెందిన వార్డు మెంబర్లు ఆశప్ప, మాదయ్య తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చాంద్ పాషా, నాయకులు బొగమోని సురేశ్, మడిగ శ్రీనివాస్, నరేశ్ గౌడ్, గోపాల్ నాయక్, బసప్ప తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి

కొండా లక్ష్మణ్ సేవలు మరువలేనివి

తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరవలేనివని పలువురు నాయకులు, అధికారులు పేర్కొన్నారు. శనివారం వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశారని, నిజాం వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని కొనియాడారు.



పరిగి: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య తదితరులు



తాండూరు టౌన్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ యాదగిరి, సిబ్బంది తదితరులు

108లో ప్రసవం

తల్లీ బిడ్డ క్షేమం

బంట్వారం: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళ 108 వాహనంలో ప్రసవించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్నారానికి చెందిన సంగీతకు శనివారం పురిటి నొప్పులు వచ్చాయి. దీన్ని గమనించిన కుటుంబీకులు 108 వాహనంలో తాండూరులోని మాతాశిశు ఆస్పత్రికి తరలిస్తుండగా ఆమె మార్గమధ్యలోనే ప్రసవించింది. ప్రస్తుతం తల్లీ బిడ్డ క్షేమంగానే ఉన్నారని, మెరుగైన వైద్యం కోసం సమీప ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ మోహన్, పైలెట్ శ్రీకాంత్ తెలిపారు.



బిడ్డను ఎత్తుకుంటున్న ఆశావర్కర్

వర్షం కురిసిన ప్రతీసారి బురదే!

- తాండూరు–జహీరాబాద్ రోడ్డుపై ఆందోళన
- సమస్యలు పరిష్కరించాలని ఇందూర్ గ్రామస్తుల వినతి

తాండూరు రూరల్: వర్షం వచ్చిన ప్రతీసారి వరద నీరు ఇళ్లల్లోకి చేరి బురదమయంగా తయారవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇందూర్ గ్రామస్తులు తాండూరు–జహీరాబాద్ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వర్షం వచ్చిన ప్రతీసారి ఎస్సీకాలనీతో పాటు పలు కాలనీల్లో నీరు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పై నుంచి వరద ప్రవహిస్తుండడంతో ఇబ్బందులు తప్పడంలేదన్నారు. గ్రామంలోని బీటీరోడ్డుపై బ్రిడ్జి నిర్మాణం సరిగ్గా చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని వివరించారు. వెంటనే బ్రిడ్జిని తొలగించి నూతన నిర్మాణం చేపట్టాలని కోరారు. దాదాపు రెండు గంటల పాటు ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న మండల ప్రత్యేకాధికారి సత్యానారాయణ, తహసీల్దార్ వెంకట్‌ప్రసాద్, ఎంపీడీఓ రతన్‌సింగ్ అక్కడికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆందోళనకారులతో మాట్లాడారు. విషయాన్ని వెంటనే ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న ఇందూర్ గ్రామస్తులు

అభివృద్ధే లక్ష్యం

మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్

దుద్యాల్: మండల అభివృద్ధే లక్ష్యమని కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుటి శేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రానికి మంజూరైన ధాన్యం నిల్వల గోదాం నిర్మాణానికి రెవెన్యూ అధికారులతో కలిసి దుద్యాల్ శివారులోని కిష్టమ్మ గుండ్ల దగ్గర శనివారం జిల్లా గిడ్డంగుల సంస్థ కార్యాలయ సిబ్బంది మహేశ్ గౌడ్, ఆర్ఐ నవీన్ కుమార్‌తో కలిసి స్థల పరిశీలన చేశారు. 191 సర్వే నంబర్‌లోని 75 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. అందులో 10 ఎకరాలు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ సుమారుగా 15 వేల టన్నుల ధాన్యం నిల్వ ఉంచేవిధంగా నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు శేఖర్ పేర్కొన్నారు. ఇదే సర్వే నంబర్‌లో సోలార్ ప్లాంట్, పార్కుకు కోసం స్థలం కేటాయించనునట్లు ఆయన తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కల్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది నర్సిములు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా, వెంకట్ రెడ్డి, యాదిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లాలప్ప, అనంతయ్య, లక్ష్మయ్య, అశోక్, శివకుమార్, ఖాజా, రమేశ్ గౌడ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



గోదాము నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న అధికారులు, నాయకులు

ఎన్నికలను సజావుగా నిర్వహించాలి



మోమిన్‌పేట: మాట్లాడుతున్న విజయలక్ష్మి



దుద్యాల్: మాట్లాడుతున్న సత్యనారాయణ



దౌల్తాబాద్: సమావేశంలో పీఓ, ఏపీఓ తదితరులు

ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం రైతు వేదికలో ప్రొసీడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు తమతమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి విషయంపై ఉన్నాతాధికారులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి సదానందం, ఎంపీఓ యాదగిరి పాల్గొన్నారు.

దుద్యాల్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల విధులను ఎలాంటి అవకతవకలు జరగకుండా నిర్వహించాలని మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ సూచించారు. మండల పరిధిలోని పోలేపల్లి రైతు వేదికలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ, బ్యాలెట్ పేపర్ల వినియోగం తదతర విషయాలపై పలు సూచనలు చేశారు. మండల పంచాయతీ కార్యదర్శులు ఆనందం, మోహన్, కిషన్, జైపాల్, తదితరులు హాజరయ్యారు.

దౌల్తాబాద్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని విధాల సన్నద్ధం కావాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో రైతువేదికలో ఎన్నికల పీఓ, ఏపీఓలకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు భీమప్ప, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై బంట్వారం, కోట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్సు పర్సన్లు పీఓలకు పలు సూచనలు చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఎంపీడీఓలు రాములు, డానియల్, ఎంపీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

పరిగి: అధికారులు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ కరీం సూచించారు. మండల పరిధిలోని నస్కల్ రైతు వేదికలో శిక్షణ తరగతులు నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధులపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: స్థానిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ బుచ్చయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు.

తాండూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల విధులు పకడ్బందిగా నిర్వహించాలని ట్రైనర్స్ బస్వరాజ్, ముసావీర్‌లు పేర్కొన్నారు. తాండూరు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వికారాబాద్ జిల్లాలోని 17 మండలాల నుంచి వచ్చిన ప్రొసీడింగ్ అధికారులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: స్థానిక ఎన్నికల సందర్భంగా అధికారులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ ఉషశ్రీ దీన్ని ప్రారంభించారు. ఎంఈఓ రాంరెడ్డి, టిఓటి అబ్దుల్‌హఖ్‌లు ప్రిసైడింగ్ అధికారుల సందేహాలను నివృత్తి చేశారు.



పరిగి: మాట్లాడుతున్న ఎంపీడీఓ కరీం